సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

గురువారం | 12 | జనవరి | 2023



86.52 కేజీల గంజాయి స్వాధీనం

కారులో తరలిస్తున్న 86.52 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, మామునూరు ఏసీపీ నరేశ్‌కుమార్ తెలిపారు.

- IIలో▸



పోదాం పద.. జాతరలకు..

ఉమ్మడి జిల్లాలో రెండు ప్రధాన జాతరలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఐనవోలు మల్లన్న, భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- IVలో▸

గరిష్టం/కనిష్టం

31.0⁰ /17.0⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి పూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్షమాపణ చెప్పిన పోలీసులు

వరంగల్ లీగల్: యువ న్యాయవాది రాజుకు బుధవారం సుబేదారి ఇన్‌స్పెక్టర్‌తోపాటు కానిస్టేబుల్ కుమారస్వామి క్షమాపణ చెప్పారు. రాజును అకారణంగా ఇన్‌స్పెక్టర్‌తోపాటు కానిస్టేబుల్ కొట్టిన ఘటనపై న్యాయవాదులు నిరసన తెలిపారు. దీంతో పోలీసులు క్షమాపణ చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా న్యాయవాదులతో స్నేహపూర్వకంగా ఉంటామని తెలిపారు. రాజీ యత్నాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్ మోహన్, శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ న్యాయవాదులు సహోదర్‌రెడ్డి, విజయభాస్కర్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సత్యనారాయణగౌడ్, గవర్నమెంట్ ప్లీడర్ తక్కలపెల్లి శ్యాంసుందర్‌రావు పాల్గొన్నారు.

జీరో షాడో డే వర్క్‌షాప్



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్, విజ్ఞాన్ ప్రసార్ సౌజన్యంతో స్పేస్ ప్రాజెక్టులో భాగంగా ఆస్ట్రోనమీపై రెండ్రోజుల వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. నిట్‌లోని టీఎల్‌సీ భవన్‌లో 'జీరో షాడో డే' వర్క్‌షాప్‌ను భారత ప్రభుత్వ విజ్ఞాన్ ప్రసార్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం సైంటిస్ట్ డాక్టర్ టీ.వీ.వెంకటేశ్వరన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాచీన కాలం నుంచి అస్ట్రోనమీ ద్వారా కాలాన్ని కొలిచేవారన్నారు. సూర్య, చంద్ర క్యాలెండర్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్లు లక్ష్మారెడ్డి, రాంచంద్రయ్య, ఓయూ ప్రొఫెసర్ రుక్మిణి, రఘునందన్, శాంతిప్రియ, 20 జిల్లాల నుంచి 75 మంది సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



విద్యారణ్యపురి: ఈనెల 9 నుంచి 11 వరకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని సేయింట్ థామస్ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో హనుమకొండ జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఇన్‌స్పైర్‌లో మాంట్‌ఫోర్ట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి హాసిత (గైడ్ టీచర్ విజయ్‌కుమార్) జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. గణిత పర్యావరణ ప్రదర్శనలో 'మన కోసం గణితం' ఉప అంశంలో తెలంగాణ మోడల్ స్కూల్ ఎల్కతుర్తి పాఠశాలలో చదువుతున్న గణేశ్ (గైడ్ టీచర్ అచరిత) ఎంపికయ్యారు. ఆరోగ్యం పరిశుభ్రత ఉప అంశం నుంచి 'బియ్యం పొట్టు బూడిదతో నీటి శుద్ధి' అంశానికి ఏకశిల టెక్నో స్కూల్ పెంబర్తి విద్యార్థి ఎం.మన్విత‌రెడ్డి (గైడ్ టీచర్ మాధవి) ఎంపికయ్యారు. రవాణా ఆవిష్కరణలు అనే ఉప అంశంలో 'ఐ సెన్సార్‌తో రోడ్డు ప్రమాదాల నివారణ' అంశంపై డిస్నీ ల్యాండ్ స్కూల్ విద్యార్థి యు.వర్షిత (గైడ్ ఉపాధ్యాయుడు మధు) జాతీయ స్థాయి ప్రదర్శనలకు ఎంపికయ్యారు. వీరిని డీఈఓ అబ్దుల్‌హై, జిల్లా సైన్స్ అధికారి, కోఆర్డినేటర్లు అభినందించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా ఆయా విద్యార్థులు మెమొంటో సర్టిఫికెట్లు అందుకున్నారు.

పనుల్లో వేగం పెంచండి



హన్మకొండ అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు – మన బడి పనుల్లో వేగం పెంచి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి మన ఊరు – మన బడి పనుల పురోగతిపై ఇంజనీరింగ్, జిల్లా విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పనులు ఆలస్యమవుతున్నాయని అధికారులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల అభివృద్ధి, సాంకేతిక విషయాలపై అధికారులకు సూచనలిచ్చారు. పెండింగ్ పనులు ఈనెల 20 వరకు పూర్తి చేసి, పనులకు వెంటనే బిల్లులు పేమెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ ఎండీ అబ్దుల్ హై, మన ఊరు మన బడి కో ఆర్డినేటర్ పి.శ్రీనివాస్, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఈఈలు, డీఈలు, ఏఈలు, ఎంఈఓలు, ఎంఎస్‌ఓలు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఏసీపీగా ప్రతాప్‌కుమార్ బదిలీ

కాజీపేట: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సీసీఆర్బీ ఏసీపీగా పనిచేస్తున్న ప్రతాప్‌కుమార్‌ను బుధవారం రాత్రి ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొంతకాలంగా వరంగల్‌లో పని చేస్తున్న ఆయనను హైదరాబాద్ విజిలెన్స్‌కు బదిలీ చేశారు.

నేడు మానుకోటకు సారు

ఉదయం 9.45 గంటలకు చేరుకోనున్న సీఎం కేసీఆర్

- కొత్త కలెక్టరేట్ భవన సముదాయం, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం
- అనంతరం అధికారులు, కార్యకర్తలతో మాటామంతి
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి
- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏర్పాట్లలో నిమగ్నం



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తదితరులు

సాక్షి, మహబూబాబాద్: గిరిజనులు, ఆదివాసీలు అధికంగా ఉన్న మానుకోట జిల్లాకు గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తున్నారు. 365 జాతీయ రహదారి పక్కనే 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన సమీకృత కలెక్టర్ కార్యాలయం, పూసపల్లి రోడ్డులోని పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. హెలికాప్టర్‌లో రానున్న ఆయన ఇక్కడి పర్యటన తరువాత నేరుగా భద్రాద్రి కొత్తగూడెం వెళ్తారు. సీఎంకు ఘన స్వాగతం పలికేందుకు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌తోపాటు ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు రెండ్రోజులుగా కసరత్తు చేస్తున్నారు. బుధవారం హెలిపాడ్, కార్యాలయాలను పరిశీలించి ఏర్పాట్లపై కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌లకు పలు సూచనలు చేశారు. సీఎం రాక సందర్భంగా జిల్లా కేంద్రంలో రెండు హెలిపాడ్లు ఏర్పాటు చేశారు. మొదట బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ దగ్గర సీఎం కేసీఆర్ దిగుతారు. పార్టీ కార్యాలయం ప్రారంభించిన తర్వాత అక్కడినుంచి కేసీఆర్ కాన్వాయ్‌లో పట్టణం నడిబొడ్డునుంచి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటారు. కార్యాలయం ప్రారంభించిన తర్వాత జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 10వేల మంది ప్రజాప్రతినిధులు, అధికారులతో కేసీఆర్ మాట్లాడతారు. ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. అదే హెలికాప్టర్ కలెక్టరేట్ దగ్గర ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకుంటుంది. ముఖ్యమంత్రి రాక సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో పార్కింగ్, గార్డెనింగ్‌తోపాటు, పూలతో అందంగా అలంకరించారు. బుధవారం రాత్రి విద్యుత్‌దీపాలను అలంకరించారు. వాటి వెలుగుల్లో కార్యాలయం జిగేల్‌మంటోంది.

ఆపద్బాంధవుడు సీఎం : మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి

'అందరూ అడిగితే వరాలు ఇస్తారు. కానీ, మన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల అవసరాలు ఏమిటని తెలుసుకొని, అధ్యయనం చేసి వరాలు ఇస్తారు' అని రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ అన్నారు. బుధవారం మహబూబాబాద్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత , ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు చేసి పేదలకు పెద్ద వైద్యం అందుబాటులోకి తేవడం,



తల్లీబిడ్డ క్షేమం కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవం, కేసీఆర్ కిట్టు పంపిణీ, రైతుల కన్నీరు తుడిచేందుకు రైతుబంధు, రైతుబీమా, దళితబంధు అందజేస్తున్నారన్నారు. పేదింటి ఆడబిడ్డకు కల్యాణలక్ష్మి అందించి పెళ్లి పెద్దగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా పథకాలు ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల రూపు రేఖలు మార్చాడన్నారు. ఇంత పనిచేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ మన జిల్లాకు రావడం గర్వకారణమని, ఆయనకు ఘన స్వాగతం పలకాలని మంత్రులు కోరారు. సమావేశంలో ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు పాల్గొన్నారు.

సీఎం టూర్ షెడ్యూల్

- ఉదయం 9.45: తాళ్లపూసపల్లి రోడ్డులో ఉన్న హెలిపాడ్ వద్ద సీఎం కేసీఆర్ హెలికాప్టర్ ల్యాండ్ అవుతుంది.
- 9.50 : రోడ్డుమార్గం ద్వారా బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయానికి చేరుకుంటారు
- 10.00 : బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం
- 10.50 : పార్టీకార్యాలయం నుంచి రోడ్డుమార్గం ద్వారా సమీకృత జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుంటారు.
- 11: కలెక్టర్ కార్యాలయం ప్రారంభిస్తారు
- 11.30 – 12-45 : జిల్లాలోని 10వేల మందితో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు.
- 1.00 :కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, అధికారులతో సమీక్ష
- 1.30: మధ్యాహ్న భోజనం , అనంతరం హెలికాప్టర్‌లో భద్రాద్రి కొత్తగూడెం బయల్దేరుతారు.





సీఎం కేసీఆర్ ప్రారంభించనున్న బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం, మహబూబాబాద్ కలెక్టరేట్ భవన సముదాయం

వరంగల్ టు ఢిల్లీ

పలాయనం చిత్తగించిన చైన్‌స్నాచర్లు

- వరంగల్ రైల్వేస్టేషన్‌లో రైలెక్కిన నలుగురు దొంగలు
- పోలీసుల నిఘాతో వచ్చిన దారి పట్టిన వైనం
- ఆ నలుగురు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారుగా గుర్తింపు
- సీసీ ఫుటేజీల ఆధారంగా పేర్లు నిర్ధారణ.. బైక్‌లు, క్యాబ్‌లపై ఆరా..



పంకజ్



సెవాగ్



మంగల్



దీపక్

సాక్షిప్రతినిధి, వరంగల్:

ఓరుగల్లు నగరంలో 48 గంటలపాటు హడలెత్తించిన చైన్‌స్నాచర్ల ముఠా పలాయనం చిత్తగించింది. ట్రైసిటీలో మహిళలే లక్ష్యంగా గొలుసు దొంగతనాలకు పక్కా స్కెచ్ వేసి రంగంలోకి దిగిన ఉత్తరప్రదేశ్ గ్యాంగ్ వచ్చిన దారి పట్టింది. వారి రాకను ముందే పసిగట్టిన వరంగల్ పోలీసుల ముప్పేట దాడులు, తనిఖీలతో ఉక్కిరిబిక్కిరైన దొంగలు రైలుమార్గంలో సరిహద్దులు దాటారు. ఈ మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన స్పెషల్ టీమ్ అందుకు సంబంధించిన సీసీ ఫుటేజీలు, ఆధారాలు సేకరించింది. మొదట ఈ దొంగల గ్యాంగ్‌లో ఐదుగురు సభ్యులని భావించిన పోలీసులు పూర్తి ఆధారాలను సేకరించిన తర్వాత నలుగురేనని నిర్ధారించుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు వారికి లభించిన సీసీ ఫుటేజీలలోని వ్యక్తులను పాత నేరస్తుల సహకారంతో గుర్తించినట్లు సమాచారం.

హైదరాబాద్ టు కాజీపేట.. తిరిగి వరంగల్ నుంచి ఢిల్లీ...

వరంగల్ నగరంలో చైన్‌స్నాచింగ్ ముఠా ప్రవేశించిందన్న సమాచారం మేరకు పోలీసులు ఈ నెల 8న అప్రమత్తమయ్యారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో వరుసగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన దుండగులకు.. వరంగల్‌లో ప్రవేశించిన వారికి దగ్గరి పోలికలు ఉన్నట్లు గుర్తించారు. హైదరాబాద్, ఉప్పల్ పరిధిలోని రాజధాని ప్రాంతంతోపాటు కల్యాణపురి, నాచారంలోని నాగేంద్రనగర్, హబ్సిగూడలోని రవీంద్రనగర్, చిలకలగూడలోని రామాలయం గుండు, రాంగోపాల్‌పేట్ రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఆగంతకులు మహిళల మెడల్లోనుంచి బంగారు గొలుసులను లాక్కెళ్లారు. హైదరాబాద్, సైబరాబాద్ ఏరియాల్లో వరుస దొంగతనాల అనంతరం హైదరాబాద్ నుంచి కాజీపేటకు చేరినట్లు అక్కడి పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు వరంగల్ నగరాన్ని పోలీసులు దిగ్బంధం చేసి వాహనాల తనిఖీలు, సోదాలు ముమ్మరం చేశారు. ఇదే క్రమంలో హైదరాబాద్ నుంచి ఇద్దరు రైలు ద్వారా, మరో ఇద్దరు మారుతి వ్యాగన్ ఆర్ క్యాబ్ ద్వారా కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలో కలుసుకుని ఆ తర్వాత అక్కడినుంచి అదృశ్యం అయినట్లు గుర్తించారు.

గుట్టువిప్పిన సీసీ కెమెరాలు..

హైదరాబాద్ నుంచి కాజీపేటకు చేరిన ఆగంతకుల గురించి బీబీనగర్, కొమ్మాల టోల్‌ప్లాజాల వద్ద సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. వాటితో పాటు కాజీపేట చౌరస్తా, రైల్వేస్టేషన్‌లలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నలుగురు చైన్‌స్నాచర్ల వివరాల కోసం రెండ్రోజులపాటు పోలీసులు గాలించారు. చివరకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన కరుడుగట్టిన పాత నేరస్తులు పంకజ్, సెవాగ్, మంగల్, దీపక్‌లుగా గుర్తించారు. కాజీపేటలో కలుసుకుని విడిపోయిన ఆ నలుగురి ఆచూకీ కోసం వరంగల్, కాజీపేట, హనుమకొండలోని ప్రధాన కూడళ్ల వద్ద 48 గంటలు పికెట్లు వేసి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఆగంతకులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు కావడంతో నగర శివార్లలోని గ్రానైట్, క్రషర్ క్వారీలలో పనిచేసే ఆ రాష్ట్ర కార్మికుల స్థావరాల్లో కూడా సోదాలు నిర్వహించారు. 48 గంటలపాటు నగరాన్ని అష్టదిగ్బంధం చేయడంతో ఎటూ పాలుపోని దొంగలు వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్‌కు.. అక్కడి నుంచి ఢిల్లీకి చేరినట్లు పోలీసులు గుర్తించారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో రైలెక్కి ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో దిగిన సమయంలో లభ్యమైన సీసీ ఫుటేజీ ఫొటోలను పోలీసులు బుధవారం విడుదల చేశారు. కాగా.. చైన్‌స్నాచర్లు ఉత్తరప్రదేశ్‌లోని శామ్లీ జిల్లాకు చెందిన వారుగా గుర్తించగా.. వారు ఉపయోగించిన బైక్‌లు, క్యాబ్‌ల గురించి ఆరా తీస్తున్నట్లు సమాచారం.

క్రీడలతో మానసిక, శారీరక దారుఢ్యం

- వరంగల్ అదనపు కలెక్టర్ శ్రీవత్స
- ఉత్సాహంగా యువజన దినోత్సవ క్రీడలు



వాలీబాల్ జట్టుతో అదనపు కలెక్టర్ శ్రీవత్స, క్రీడల అధికారులు

కాశిబుగ్గ: మానసిక, శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీవత్స అన్నారు. స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఓసిటీ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్రీవత్స ముఖ్య అతిథిగా హాజరై క్రీడలు ప్రారంభించారు. ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో అండర్ 14 వాలీబాల్(బాలుర) విభాగంలో మొదటి స్థానంలో టీటీడబ్ల్యూఆర్‌ఎస్ వరంగల్, రెండో స్థానం ఆసిస్ హైస్కూల్ జట్టు నిలిచాయి. ముగ్గుల పోటీల్లో జ్యోత్స్న, జ్యోతి ప్రథమ స్థానం, గాయత్రి, ప్రియాంక ద్వితీయ స్థానంలో నిలిచారు. ఫ్యాన్సీ డ్రెస్ పోటీలో నవ్య విజేతగా నిలవగా.. రెండో స్థానంలో చైత్ర నిలిచారు. అలాగే ఉమెన్స్ మ్యూజికల్ చైర్ పోటీల్లో మొదటి స్థానం పి.ఉమామహేశ్వరి, రెండో స్థానంలో వి.భావనదేవి గెలుపొందారు. సాయంత్రం వారికి జిల్లా యువజన క్రీడల అధికారి ఎస్.ఇందిర బహుమతులు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారి సుబ్బారావు, హ్యాండ్‌బాల్ కోచ్ సత్యవాణి, సారంగపాణి, సుమన్, లింగమూర్తి, కుమారస్వామి, పీఈటీలు, డీవైఎస్‌ఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పథకాల్ని ప్రజలకు చేర్చాలి

- జెడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్ కుమార్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

హన్మకొండ: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చాలని హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. బుధవారం హనుమకొండలోని జెడ్పీ కార్యాలయంలో సుధీర్‌కుమార్ అధ్యక్షతన 1, 2, 4, 7వ స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఇందులో పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, ఖాదీ–గ్రామీణ పరిశ్రమల మండలి, చేనేత –జౌళి శాఖ, ఆబ్కారీ, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్య శాఖ, యువజన, క్రీడా శాఖ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ, జిల్లా ప్రణాళికపై సమీక్షించారు. అధికారులు శాఖల వారీగా ప్రగతిని వివరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీరాములు అధ్యక్షతన జరిగిన 3వ స్థాయీ సంఘం సమావేశం జరిగింది. హసన్‌పర్తి జెడ్పీటీసీ సునిత అధ్యక్షతన 6వ స్థాయీ సంఘ సమావేశంలో జరిగింది. ఇందులో జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్‌రావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేద్దాం

నయీంనగర్: ఈనెల 18 నుంచి అమలు చేస్తున్న కంటి వెలుగు–2 కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు అధికారులు విజయవంతం చేయాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. బుధవారం 'కుడా' కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ ప్రావీణ్య అధ్యక్షతన వరంగల్ జిల్లాలోని జీడబ్ల్యూఎంసీ పరిధి వార్డుల్లో నిర్వహించే కంటి వెలుగు2 సన్నాహక సమావేశం నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యే నరేందర్ హాజరయ్యారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కంటి వెలుగు జనవరి 18న ప్రారంభమై జూన్ 30న ముగుస్తుందన్నారు. 18 ఏళ్లు నిండిన వాళ్లు వినియోగించుకోవాలని కోరారు. కమిషనర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలోని 32 డివిజన్లోని 49 లొకేషన్లలో మొత్తం 17 మెడికల్ బృందాల ద్వారా 'కంటి వెలుగు' నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వరంగల్ అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, ప్రోగ్రాం అధికారి గోపాల్‌రావు, అదనపు కమిషనర్ రవీందర్‌యాదవ్, ఎంహెచ్‌ఓ రాజేశ్, కార్పొరేటర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యత.. నగుబాటు!

- నాసిరకంగా స్మార్ట్‌సిటీ సీసీ రోడ్ల నిర్మాణ పనులు
- సిమెంట్ లేస్తున్నా నోరు మెదపని ఇంజనీర్లు
- కన్నెత్తి చూడని క్వాలిటీ కంట్రోల్



ఈఫొటోలో కనిపిస్తున్న సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్డు వరంగల్ చౌరస్తా నుంచి మేదరవాడ మీదుగా హంటర్ రోడ్డు వెళ్తుంది. స్మార్ట్‌సిటీ నిధులతో కొత్తగా వేశారు. మూడు నెలలకే సిమెంట్ కొట్టుకుపోయి కంకర తేలింది. గుంతలు పడింది.

వరంగల్ అర్బన్: సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు 'దగ్గరి' వారుగా చెబుతుంటారు. దీంతో నాణ్యతా ప్రమాణాల వ్యవహారం మనకెందుకంటూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అంతా పెద్దవారు.. వీరి వ్యవహారంలో మన జోక్యమెందుకంటూ ఇంజనీర్లు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రణాళిక లేకుండానే పనులు

మనం ఏ చిన్న పని చేయాలన్నా ఓ ప్రణాళిక రూపొందిస్తాం. అలాంటిది రూ.కోట్లలో చేపట్టే వాటికి ఎంత పకడ్బందీ ప్రణాళిక ఉండాలి. నాణ్యత విషయంలో ఎంత జాగ్రత్తగా వ్యవహరించాలి. టెండర్ నిర్వహించామని, పని అయిపోయిందని అధికారులు సైలెంట్ అయిపోతే ఆతర్వాత మన్నిక గుంతలపాలే. కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరించి నామమాత్రంగా పనులు నిర్వహించి పబ్బం గడుపుతుంటే.. రూ.కోట్లతో పనులు చేపట్టే స్మార్ట్‌సిటీ పనుల్లో డొల్లతనం బయటపడుతోంది.

సీసీ.. ఛీఛీ

వరంగల్‌లో స్మార్ట్‌సిటీ పనుల్లో భారీగా అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది ఇంజనీర్లు, బినామీ కాంట్రాక్టర్లు కుమ్మక్కై బిల్లులు తయారు చేస్తున్నారు. గతంలో మునుపెన్నడూ లేని విధంగా అవినీతి, నాసిరకానికి చోటు లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. అందుకు విరుద్ధమైన పరిస్థితి క్షేత్రస్థాయిలో ఉంది. నెలలు గడవకముందే చేపట్టిన పనులు అవి పాడై పోతున్నాయనడానికి ఆకర్షణీయ రహదారే ఉదాహరణ. వరంగల్ మేదరవాడలో సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఇది ఆర్నెళ్లు పూర్తి కాకుండానే సిమెంట్ ఊడిపోయి కంకర తేలింది. పగుళ్ల తేలి గుంతలు పడుతోంది. మరికొద్ది నెలల్లో ఆరోడ్డంతా ఛిద్రమయ్యే పరిస్థితి. ఎస్‌ఎస్‌ఎం క్లబ్, మండిబజార్, జేపీఎన్ రోడ్డులో అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించింది. బల్దియా, స్మార్ట్ సిటీ ఇంజనీర్లు, అధికారులు గుర్తించి నాణ్యతతో నిర్మించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

> సాధారణంగా కొత్తగా వేసిన సిమెంట్ కాంక్రీట్(సీసీ) రహదారి జీవితకాలం 20 ఏళ్లు. ఆ దారి నాణ్యత (థిక్‌నెస్) ఆధారంగా కొన్ని 40 ఏళ్లు కూడా మన్నేలా నిర్మాణం చేయాలి. ఇవి స్మార్ట్‌సిటీలోని నిబంధనలు. కానీ.. ఇదే స్మార్ట్‌సిటీ పనుల్లో నగరంలోని ఓ సీసీ రోడ్డు నిర్మించి ఆర్నెళ్లు కూడా గడవక ముందే దెబ్బతిని దయనీయంగా మారింది. అందులో ఆమ్యామ్యాలు పనుల్లో విశ్వసనీయత ఎంత స్థాయిలో జరిగిందో ఈ చిత్రాలు కళ్లకు కడుతున్నాయి.

ఆకర్షణీయం.. అధ్వానం

స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా వరంగల్, హనుమకొండలోని 11 రహదారుల పనులకు రూ.70 కోట్లు ప్రతిపాదించి టెండర్లు పిలిచారు. అనంతరం కొందరు తమ అధికారాన్ని వినియోగించి కొన్ని సీసీ రోడ్లు, మరికొన్ని తారు రోడ్లుగా రీవైజ్డ్ చేశారు. ఆనిధులు రూ.50కోట్లకు తగ్గించారు. కాగా.. వరంగల్ ములుగు రోడ్డు నుంచి ఎంజీఎం మీదుగా.. పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, లేబర్ కాలనీ వరకు. వెంకట్రామా నుంచి వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ మీదుగా స్టేషన్‌రోడ్డు, వరంగల్ చౌరస్తా, మండిబజార్ నుంచి పోచమ్మ మైదాన్ వరకు. వరంగల్ చౌరస్తా నుంచి మేదరవాడ మీదుగా చౌరస్తా నుంచి ఆర్‌ఎస్‌టీ రోడ్డు మీదుగా ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ వరకు అభివృద్ధి పనులు చేపట్టారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ డివైడర్ల పనులు చేపట్టారు. ఏడాదిన్నర గడిచినా.. పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అక్కడక్కడా సీసీ పనులు పూర్తవక, డ్రెయినేజీ పైపులైన్ల ఛాంబర్ల మూతలు ఏర్పాటు చేయకపోవడంతో షాపుల నిర్వాహకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నాణ్యతలో తేడాలొస్తే మళ్లీ వేయిస్తాం

స్మార్ట్‌సిటీలో భాగంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల నాణ్యత సుమారు 40 ఏళ్లపాటు మన్నికగా ఉండాలి. నాణ్యతలో తేడా ఉంటే నోటీసులిస్తాం. సీసీ రోడ్డును తవ్వించి, మళ్లీ వేయిస్తాం. నాణ్యత పాటించాల్సిందే.

– ఆనంద్ వోలేటి, స్మార్ట్‌సిటీ ప్రతినిధి

అభివృద్ధి పనుల పరిశీలన

వరంగల్ అర్బన్: వరంగల్ నగరపాలక సంస్థ పరిధి పలు డివిజన్లలో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి బుధవారం కమిషనర్ ప్రావీణ్య పరిశీలించారు. అభివృద్ధి పనుల్ని వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిమళ కాలనీలో నిర్మించిన పార్కు, నక్కలగుట్ట వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వసతులు, జవహర్ కాలనీ, గోపాల్‌పూర్, చింతగట్టు, హసన్‌పర్తి ప్రాంతాల్లో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించారు. కమిషనర్ వెంట బల్దియా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజయ్య, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, డీఈలు సంతోష్‌బాబు, సారంగం, ఏఈలు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ప్రావీణ్య

ఐనవోలు జాతరకు ప్రత్యేక బస్సులు

హన్మకొండ: ఐనవోలు మల్లికార్జున స్వామి దర్శనార్థం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత తెలిపారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్ జిల్లా బస్‌స్టేషన్ నుంచి ఈ బస్సులు బయలుదేరుతాయని, నాలుగు రోజులపాటు రోజూ 10 ప్రత్యేక బస్సులు నడుపుతామని వివరించారు. భక్తుల సంఖ్యను బట్టి మరిన్ని అదనపు సర్వీస్‌లు పెంచుతామని తెలిపారు. అలాగే, భక్తుల సౌకర్యం కోసం ఐనవోలు దేవస్థానం క్యాంపు నుంచి కొమురవెల్లి, యాదగిరిగుట్ట, హైదరాబాద్‌కు బస్సులు నడుపుతామని వివరించారు.

ఉప సర్పంచ్, వార్డు సభ్యుడిపై కేసు

సంగెం: గ్రామ పంచాయతీ ప్రత్యేక సమావేశంలో సర్పంచ్‌పై దాడి చేసిన ఉప సర్పంచ్, వార్డు సభ్యుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పెండ్యాల దేవేందర్ బుధవారం తెలిపారు. వరంగల్ జిల్లా సంగెం మండలం గొల్లపల్లి సర్పంచ్ మెరుగు మల్లేశంపై ప్రత్యేక సమావేశం సందర్భంగా ఈ నెల 7న ఉపసర్పంచ్ పేరబోయిన రాజు, వార్డు సభ్యుడు నూనెల అనిల్ దాడి చేశారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అగ్గలయ్య గుట్టపై పర్యవేక్షణ ఏదీ?

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- టెండర్ లేకుండా ఎంట్రీ ఫీజు వసూలు
- 'కుడా' అధికారుల తీరుపై విమర్శలు





అగ్గలయ్య గుట్ట ప్రారంభంలో ఎంట్రీ ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు

జైన్ ట్రస్టు పేరుతో జారీ చేస్తున్న ఎంట్రీ టికెట్

హన్మకొండ చౌరస్తా: జైనులు ఎంతో పవిత్రంగా భక్తిశ్రద్ధలతో కొలిచే దిగంబరస్వామి కొలువుదీరిన అగ్గలయ్య గుట్ట అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ప్రేమ జంటలు ఇష్టారీతిగా వ్యవహరిస్తుండటంతో గుట్టపై అపవిత్రత చోటుచేసుకోవడంతోపాటు భక్తులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకోలేని పరిస్థితి నెలకొంది. అధికారుల పర్యవేక్షణా లోపం, ప్రైవేటు వ్యక్తుల అజమాయిషీ వల్ల ఇలాంటి వ్యవహారాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కుడా అధికారులు, పోలీసులు దృష్టి సారించి గుట్టపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా పద్మాక్షి కాలనీలోని అగ్గలయ్యగుట్ట(జైన్ మందిర్)ను రూ.1.20కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. గుట్ట ప్రారంభంలో సహజ సిద్ధంగా కనిపించేలా జలపాతం, కొలను, గార్డెనింగ్, గుట్టపైకి మెట్లు, దిగంబర శిల్ప సౌందర్యం, లైటింగ్‌తో సుందరీకరణ పనులు పూర్తి చేశారు.
- పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన అగ్గలయ్య గుట్టను తిలకించేందుకు వచ్చే పర్యాటకుల నుంచి జైన్ అతిశయ్‌క్షేత్ర్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో ఎంట్రీ ఫీజు రూ.15 చొప్పున వసూలు చేస్తున్నారు. ఫీజు వసూళ్లపై ప్రశ్నిస్తున్న పర్యాటకులు, భక్తులకు.. ఈ గుట్ట నిర్వహణ తమ ఆధీనంలో ఉందని, పర్యవేక్షణ కోసం కనీస ఫీజు వసూలు చేస్తున్నామని చెప్పుకొస్తున్నారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించే వారి నుంచి రుసుము వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే అధికారం ఏ శాఖకు ఉండదు. కానీ.. తప్పనిసరి పరిస్థితుల్లో నిర్వహణ, పర్యవేక్షణ చేయాలంటే నిబంధనల ప్రకారం టెండర్లు పిలవాల్సి ఉంటుంది. అయితే అగ్గలయ్య గుట్ట విషయంలో ఎలాంటి టెండర్లు నిర్వహించలేదని స్పష్టమవుతోంది. కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసి అభివృద్ధి చేసిన పర్యాటక ప్రాంతాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతిలో పెట్టడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.
- పర్యాటక ప్రాంతంగా రూపుదిద్దుకున్న తర్వాత ఇటీవలి కాలంలో అత్యధికంగా ప్రేమ జంటలు, అసాంఘిక కార్యక్రమాలకు గుట్ట నిలయంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.15 వెచ్చించి టికెట్ తీసుకున్న పలువురు గుట్టపై గంటలతరబడి తిష్టవేస్తున్నారని పలు వురు వాపోతున్నారు. ఇప్పటికైనా 'కుడా' ఉన్నతాధికారులు, పోలీసులు దృష్టి సారించి పర్యాటక ప్రాంత పవిత్రతను కాపాడాలని కోరుతున్నారు.

వైస్ చైర్మన్ నిర్ణయం మేరకే..

కుడా వైస్ చైర్మన్ నిర్ణయం మేరకే ఎంట్రీ ఫీజు వసూళ్లను జైన్ ట్రస్ట్‌కు అప్పగించాం. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడమే కాదు, నిర్వహణ, పర్యవేక్షణ కూడా అవసరమే. అందుకే ఎంట్రీ ఫీజు వసూలు చేస్తున్నాం. నామినల్‌గా రూ.15గా నిర్ణయించాం. ఈ రోజుల్లో రూ.15 అంటే చాయ్ తాగినంత కాదు.

- భీంరావు, కుడా ఈఈ

టెండర్ లేకుండానే వసూళ్లు..



అగ్గలయ్య గుట్ట సందర్శకుల నుంచి రూ.15 ఫీజు వసూలు చేయడం సరికాదు. ఈ ఆదాయం పురావస్తు, పర్యాటక, కుడాలలో ఏ శాఖకు వెళ్తుందో అధికారులే చెప్పాలి. ఏ ప్రాతిపదికన ఫీజులు నిర్ణయించి వసూలు చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తా.

- తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్, 10వ డివిజన్

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

వరంగల్ లీగల్ : హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ వరంగల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటేశ్వరరావు బుధవారం తీర్పు వెలడించారు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామానికి చెందిన మంద రాజు ఇంట్లో ఉన్న తాటి చెట్టును అదే గ్రామానికి చెందిన గీత కార్మికుడు పుట్ట యాకయ్య ఎక్కేవాడు. 2020, మార్చి 1న యాకయ్య తాటిచెట్టు ఎక్కి కుండలోని నురుగును కిందపడేయంతో రాజు కుటుంబీకుల దుస్తులపై పడింది. దీంతో మంద రాజు భార్య కోపగించుకుంది. ఇది మనుసులో పెట్టుకున్న గీత కార్మికుడు యాకయ్య అదే రోజు రాత్రి మంద రాజును తీవ్ర పదజాలంతో దూషించాడు. ఎందుకు తిడుతున్నావని రాజు ప్రశ్నించాడు. దీంతో గీత వృత్తికి ఉపయోగించే కత్తితో రాజు కడుపులో పొడిచాడు. రాజు అప్రమత్తమై అడ్డుకోవడంతో చేతులకు, కడుపులో గాయాలయ్యాయి. ఈ ఘటనపై మరుసటి రోజు మామునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో హత్యాయత్నం కింద కేసు నమోదైంది. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. విచారణలో నేరం రుజువుకావడంతో యాకయ్యకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి వెంకటేశ్వరరావు తీర్పు చెప్పారు. కేసును ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు పరిశోధించగా లైజన్ ఆఫీసర్ వెంకటస్వామి పర్యవేక్షణలో కానిస్టేబుల్ రమేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టాడు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ అబ్దుల్ నబీ కేసు వాదించారు.

రెడ్డి చికెన్ సెంటర్
హోల్‌సేల్ రేటు
బ్రాయిలర్ చికెన్ రేటు
స్కిన్‌లెస్ చికెన్ రేటు
Cell: 9989299661

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ శ్రీ నాయకపు నాగరాజు, తండ్రి: లక్ష్మీనారాయణ మరియు శ్రీ నాయకపు శరత్, తండ్రి: లక్ష్మీనారాయణ, నివాసం: 1-7-211, రెవిన్యూ కాలనీ, సుబేదారి, హన్మకొండ గారు, శ్రీ పొడు విజయ్‌కుమార్ గారి నుండి అతడికి సంబంధించిన ఇంటి నెం. 1-7-156, విస్తీర్ణం 200.00 చ॥గ॥, రెవిన్యూ కాలనీ, హన్మకొండ పట్టణం మరియు జిల్లా పరిధిలో గల దానిని కొనదలుచుకున్నారు మరియు ఇట్టి ఆస్తిపై నేను Tata Capital Housing Finance Ltd., Warangal Branch నందు ఋణము తీసుకోదలిచినాను. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్న 7 రోజులలో తెలియజేయగలరు లేనిచో అభ్యంతరములు లేవని భావించబడును.

ఇట్లు / టి. సాయన్న, BA, LLB
అడ్వకేట్
ఇ.నెం. 2-11-297, విద్యారణ్యపురి, హన్మకొండ, సెల్: 9440536898.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా, రాచర్ల రాజకుమార్, తండ్రి: రాజయ్య గారు రాచర్ల తిరుపతి, గారి నుండి సర్వే నెం. 138, గోపాలపురం గ్రామ పరిధిలో ప్లాట్‌నెం.11/బి 150 చదరపు గజముల, రిజిస్టర్ దస్తావేజు నెం. 7210/2011, తేది. 29.12.2011 ద్వారా కొనుగోలు చేసినారు. మరియు రాచర్ల రాజకుమార్ గారు సర్వే నెం. 138లో ప్లాట్ నెం. 11/ఏలో 150 చదరపు గజముల స్థలం ... గారి నుండి దస్తావేజు 2449/2003, తేది. 08.12.2003 ద్వారా కొనుగోలు చేసినారు. ... దస్తావేజు నెం. 124/1988, తేది 25.01.1988 రోజున సర్వే నెం. 138, ప్లాట్ నెం.11, 300 చదరపు గజముల ... ఎక్కడో పోయినదని ... ఎవరి వద్దనైనా ఉన్నట్లో లేదా ఇట్టి ఆస్తిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నచో ఈ ప్రకటన తేది నుండి వారం రోజుల లోపు ... అభ్యంతరాలు తెలియజేయగలరు. ... బ్యాంక్ వరంగల్‌వారి నియమ నిబంధనల ప్రకారము రాచర్ల రాజకుమార్ గారికి మార్టిగేజ్ అప్పు మంజూరు చేయుటకు నిర్ణయం తీసుకోగలరు.

షెడ్యూల్ ఆస్తికి హద్దులు

తూర్పు: ప్లాటు నెం.12, పడమర: 40 ఫీట్ల వెడల్పు దారి, ఉత్తరం: ప్లాటు నెం. 10, దక్షిణం: సత్యనారాయణ గారి ప్లాటు నెం.13

Sd/- PARAMALLA KRISHNA SWAMY,
B.Com., LLB, ADVOCATE
H.No. 1-9-1699, 1st St Deena Dayal Nagar,
Hanamkonda Warangal-506001, Cell: 9441551024

కేంద్రం వైఖరి వల్లే..

- ఆర్థిక, సామాజిక అసమానతలు
- బీఆర్‌ఎస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం
- 18న ఖమ్మం సభను సక్సెస్ చేయండి
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

సాక్షిప్రతినిధి, వరంగల్: కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లే ఆర్థిక, సామాజిక అసమానతలు పెరుగుతున్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి విమర్శించారు. పెరిగిన జనాభాకు అనుకూలంగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాల్సి ఉండగా 60 ఏళ్లుగా పాత రిజర్వేషన్లే అమల్లో ఉన్నాయని, ఇప్పుడు ఉన్న రిజర్వేషన్లను కేంద్రం ఎత్తివేసే కుట్ర చేస్తుందని ఆరోపించారు. బుధవారం హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎంపీ సీతారాంనాయక్‌లతో కలిసి కడియం శ్రీహరి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులను అణచివేతకు గురిచేస్తుందని.. ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టికల్ 46 ప్రకారం వెనుకబడిన వర్గాలను ప్రోత్సహించాలని 27 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించడంతో పాటు ఈడబ్ల్యూఎస్ కింద పేద అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్ ఇవ్వడం హర్షణీయమేనని అన్నారు. బీసీ, ఈబీసీలకు ఏ విధంగానైతే చట్ట సవరణ చేసి రిజర్వేషన్ కల్పించారో అదే విధంగా ఎస్సీలకు 18, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రానికి వచ్చినప్పుడు విషయాన్ని మరోసారి ఆయన దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రిజర్వేషన్లపై తమ వైఖరిని అనేక రకాలుగా వినిపిస్తున్నా రిజర్వేషన్లు పెంచకపోగా, ఉన్న రిజర్వేషన్లను ఎత్తేసే కుట్ర చేస్తుందన్నారు. కులాలు, మతాలను గుర్తు చేసి ప్రజల మధ్య చిచ్చుపెడుతుందని, వాటిని ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. 18న ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కడియం శ్రీహరి పిలుపునిచ్చారు.

రైలు ఢీకొని 65 గొర్రెలు మృతి



రైలు ఢీకొని మృతి చెందిన గొర్రెలు

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామ శివారులో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని 65 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దండేపల్లి గ్రామానికి చెందిన మాదం భిక్షపతి గొర్రె మంద రైల్వే ట్రాక్ దాటుతున్న క్రమంలో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. దీంతో 65 గొర్రెలు మృతి చెందాయి. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై జక్కుల పరమేష్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.6.50లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు భిక్షపతి వేడుకున్నాడు.

యువతి అదృశ్యం



భారతి

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి ప్రాంతానికి చెందిన గండికోట భారతి(27) అనే యువతి అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. భారతి తన తల్లి కళకు ఫోన్ చేసి ట్యాబ్‌లెట్లు వేసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లి చూడగా భారతి కనిపించకుండాపోయింది. దీంతో యువతి తల్లి కళ బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని, ఆచూకీ తెలిసిన వారు 87126 85122, 87126 85008 నంబర్లలో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

86.52 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

- ముగ్గురు అంతర్రాష్ట్ర సభ్యుల ముఠా అరెస్ట్
- కారు, మూడు సెల్‌ఫోన్లు సీజ్

మామునూరు: కారులో తరలిస్తున్న 86.52 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, మామునూరు ఏసీపీ నరేష్‌కుమార్ తెలిపారు. బుధవారం మామునూరు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం పినారిపాలెంకు చెందిన షేక్ జిలానీ, నర్సీపట్నం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన అడ్డూరి వెంకటేష్, ఖమ్మంలోని శంబానీనగర్‌కు చెందిన మహ్మద్ అఫ్రోజ్ ముఠాగా ఏర్పడ్డారు. నర్సీపట్నం మండలం నీలంపేట గ్రామానికి చెందిన అడిగర్ల ప్రకాశ్‌కుమార్ వద్ద ఎండు గంజాయి కొనుగోలు చేశారు. కారులో వరంగల్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తుండగా పోలీసులకు పక్కా సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ ఆదేశాలు, ఏసీపీ జితేందర్‌రెడ్డి, మామునూరు ఏసీపీ నరేష్‌కుమార్ సూచన మేరకు మామునూరు టీఎస్‌ఎస్పీ నాలుగో బెటాలియన్ రెండో గేట్ వద్ద టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. పోలీసులు కారు ఆపే ప్రయత్నం చేయగా ముగ్గురు నిందితులు డోర్లు తీసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. కారులో క్షుణ్ణంగా తనిఖీ చేయగా 86.52 కేజీల ఎండు గంజాయి లభించింది. దీంతో ముగ్గురిని అరెస్ట్ చేసి ఎండు గంజాయి, కారు, మూడు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. సమావేశంలో ఎస్సైలు కృష్ణవేణి, రాజేష్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

యువతిని బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తిపై కేసు

కాజీపేట: ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తి మాయమాటలు నమ్మి రూ.3.20 లక్షలు సమర్పించుకుంది.. తీరా నగదు ఇవ్వకుండా సదరు వ్యక్తే యువతిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. ఈ ఘటనపై యువతి తల్లి బుధవారం రాత్రి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి కథనం.. దర్గా కాజీపేట ప్రాంతానికి చెందిన సుభాషిణిరెడ్డి బీటెక్ చదువుతోంది. ఆన్‌లైన్‌లో పరిచయమైన హుజూరాబాద్‌కు చెందిన సుమంత్‌రెడ్డి అత్యవసరం ఉందని చెబితే రూ.3.20 లక్షలు ఇచ్చింది. తిరిగి డబ్బు ఇవ్వాలని సుభాషిణిరెడ్డి అడగడంతో ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని సుమంత్‌రెడ్డి బెదిరించాడు. దీంతో యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ



గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న తస్లీం

కేయూ క్యాంపస్: భారత్ జీ20 దేశాల అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో రాజ్‌భవన్‌లో రాష్ట్రస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కాకతీయ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు 8 బహుమతులు సాధించినట్లు కేయూ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ కనకరత్నం బుధవారం తెలిపారు. వక్తృత్వ పోటీల్లో హాసం రజాక్ (ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల), కృతియా ప్రియాచందన్(కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల), బి.చాముండేశ్వరి(సరస్వతి డిగ్రీ కళాశాల, ఖమ్మం).. వ్యాసరచన పోటీల్లో బి.అంజలిదేవి(కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల), బి.ధరణి(యూనివర్సిటీ కాలేజ్ కెమిస్ట్రీ విభాగం), అయిదా తస్లీం (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), సయ్యద్ ఫర్హీన్, అసమా సుల్తానా(ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కాలేజ్, ఖమ్మం) ప్రతిభ కనబరిచి ఉర్దూ, ఇంగ్లిష్, హిందీ, తెలుగు మాధ్యమాల్లో విజేతలుగా నిలిచారు. విజేతలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, నగదు పారితోషికం అందజేశారు.

అమ్మ ఒడికి చిన్నారి

- కలెక్టర్ సమక్షంలో అప్పగింత



కలెక్టర్ గోపి సమక్షంలో చిన్నారిని అక్కున చేర్చుకుంటున్న తల్లి

కరీమాబాద్: నెల రోజులుగా కొనసాగుతూ వస్తున్న ఉత్కంఠకు తెరపడింది. ఇంతకాలం దత్తత పేరుతో కన్నవారికి దూరంగా హైదరాబాద్‌కు చెందిన దంపతుల వద్ద ఉన్న చిన్నారి.. బుధవారం వరంగల్ కలెక్టర్ గోపి సమక్షంలో తన తల్లి ఒడికి చేరింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని పిట్టకాయలతండా చెందిన బానోతు చిన్ని - భీమన్న దంపతులకు రెండవ సంతానంగా అమ్మాయి జన్మించింది. దీంతో వారు ఆ చిన్నారిని హైదరాబాద్‌కు చెందిన లక్ష్మి - పరశురాం దంపతులకు దత్తత ఇచ్చారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో నెక్కొండ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారులు, జిల్లా బాలల సంక్షేమ సమితి అధికారులు.. పోలీసుల సహకారంతో తండాకు వెళ్లి విచారణ చేపట్టి గ్రామస్తుల అభిప్రాయాలు తీసుకున్నారు. హైదరాబాద్‌లోని లక్ష్మి - పరశురాంలను హనుమకొండకు పిలిపించి వారి నుంచి చిన్నారిని అధికారులు తీసుకుని శిశు గృహంలో ఉంచారు. ఈక్రమంలోనే తమ పాప తమకు కావాలని చిన్ని, భీమన్న దంపతులు కోరడంతో జిల్లా కలెక్టర్ గోపి సమక్షంలో అప్పగించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ వసుధ, సభ్యులు డాక్టర్ ఆకులపల్లి మధు, సంపత్, సుజాత, షాహెదాబేగం, బండ రామలీల, డీసీపీయూ సోషల్ వర్కర్ పద్మలత, చైల్డ్‌లైన్ కౌన్సిలర్ ప్రభ, మాజీ సర్పంచ్ అన్నమనేని సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌లో మనోళ్ల సత్తా



మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న జిల్లా సైన్స్ అధికారి, గైడ్ టీచర్, విద్యార్థి

కాశిబుగ్గ సెంటర్: మూడు రోజులుగా నిర్మల్ పట్టణంలో జరుగుతున్న 10వ ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్, 50వ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనల్లో జిల్లాకు చెందిన నెక్కొండ, లింగాపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సత్తా చాటినట్లు డీఈఓ వాసంతి పేర్కొన్నారు. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో గణిత విభాగంలో నెక్కొండ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మూడో బహుమతి సాధించారని, ఈనెల 27 నుంచి 31 వరకు కేరళలోని తిరుచ్చిలో జరిగే దక్షిణ భారతదేశ స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే సెమినార్ విభాగంలో రాష్ట్రస్థాయిలో లింగాపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల మొదటి బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు. బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కె.శ్రీనివాస్, గైడ్ టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా పలు రైళ్లు



కాశిబుగ్గ: ఉత్తరాదిలో కురుస్తున్న పొగ మంచుతో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముఖ్యంగా న్యూఢిల్లీ నుంచి వరంగల్ మీదుగా రాకపోకలు సాగించే నాలుగు రైళ్ల ఆలస్యంతో ప్రయాణీకులు, శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లే మాలధారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. న్యూఢిల్లీ నుంచి మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు వరంగల్ రావాల్సిన కేరళ ఎక్స్‌ప్రెస్ బుధవారం మధ్యాహ్నం 12.05 గంటలకు స్టేషన్‌కు చేరుకుంది. 17 గంటలు ఆలస్యంగా నడుస్తోంది. విశాఖపట్నం నుంచి ఉదయం 6.45 గంటలకు రావాల్సిన ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు సాయంత్రం 5 గంటలకు వరంగల్ చేరుకుంది. పది గంటలు ఆలస్యంగా అయింది. న్యూఢిల్లీ నుంచి చెన్నై సెంట్రల్(12622) మధ్య తిరిగే తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు నాలుగు గంటలు ఆలస్యం, న్యూఢిల్లీ నుంచి తిరువనంతపురం సెంట్రల్(12626) మధ్య తిరిగే కేరళ ఎక్స్‌ప్రెస్ రైలు 12 గంటలు ఆలస్యం, న్యూఢిల్లీ నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ మధ్య నడిచే గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ రైలు(12616) 6 గంటలు ఆలస్యంగా, న్యూఢిల్లీ నుండి విశాఖపట్నం మధ్య నడిచే ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు(20806) 10 గంటల ఆలస్యం నడుస్తున్నాయి.

17 నుంచి బెలగవి - మణుగూరు మధ్య ప్రత్యేక రైలు

కాజీపేట రూరల్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాజీపేట జంక్షన్ మీదుగా కర్ణాటకలోని బెలగవి-మణుగూరు రైల్వేస్టేషన్‌ల మధ్య ఈ నెల 17 నుంచి ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. బెలగవి-మణుగూరు(07335) డైలీ ఎక్స్‌ప్రెస్ జనవరి 17వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకు బెలగవిలో అర్ధరాత్రి 1.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.52 గంటలకు కాజీపేట జంక్షన్ చేరుకొని అర్ధరాత్రి 12.50 గంటలకు మణుగూరు చేరుకుంటుంది. అదేవిధంగా మణుగూరు-బెలగవి (07336) ఎక్స్‌ప్రెస్ మణుగూరులో జనవరి 18వ తేదీ నుండి మార్చి 31వ తేదీ వరకు ప్రతి రోజు 3.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 3.55 గంటలకు బెలగవికి చేరుకుంటుంది. ఈ ఎక్స్‌ప్రెస్‌కు భద్రాచలం, డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రం, వరంగల్, కాజీపేట, జనగామ, భువనగిరి, సికింద్రాబాద్, బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూర్, సేరం, మలికదిరోడ్, చిత్తపూర్, యాద్‌గిరి, కృష్ణ, రాయచూర్, మంత్రాలయం రోడ్, కొస్గి, ఆదోని, గుంతకల్, బళ్లారి, దారోజి, హోస్పేట, కొప్పాల్, గడాగ్, ఉబ్లీ, ద్వారంద్, ఐనవర్, లోండా, కాస్పూర్‌లో హాల్టింగ్ కల్పించారు.

మార్కెట్ ఎదుట నిరసన ప్రదర్శన



ఆందోళన నిర్వహిస్తున్న చాంబర్ ప్రతినిధులు

వరంగల్ రూరల్: మార్కెట్‌లో లారీ ఓనర్స్ అసోసియేషన్ దౌర్జన్యానికి నిరసనగా వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయం ఎదుట చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. చాంబర్ ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్ విభాగం సభ్యులు ఎనబోతుల వెంకటేశ్వర్లు, ఫర్మ్ యజమాని రామన్న మంగళవారం మార్కెట్‌లోని గోదాం కాంటా వద్ద మొక్కజొన్నలను లారీలో లోడ్ చేస్తుండగా.. లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిన అఫ్జల్ దౌర్జన్యంగా లారీలో మక్కలను అన్‌లోడ్ చేయించి.. లారీ లైసెన్స్, ఇతర పేపర్లను లాక్కెళ్లాడు. దీనిపై వెంటనే రామన్న చాంబర్‌కు ఫిర్యాదు చేశాడు. చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, గౌరవ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాశ్ తదితరులు అఫ్జల్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ శ్రీవత్స దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఈ సమస్యపై చర్చించేందుకు లారీ ఓనర్ అసోసియేషన్ నాయకులు మార్కెట్‌కు రాకపోవడంతో బుధవారం చాంబర్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. దీంతో మార్కెటింగ్ శాఖ జేడీ.. పోలీసు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్ష, గౌరవ కార్యదర్శితోపాటు ఉపాధ్యక్షుడు మొగిలి చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి అల్లే సంపత్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. చాంబర్ అసోసియేషన్ ఫిర్యాదు మేరకు లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిన అఫ్జల్‌పై కేసు నమోదు చేసినట్లు ఏనుమాముల ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ మామునూర్‌లో అభివృద్ధి చేసిన కుడా లేఅవుట్ 263, 228, 200, 165, 134 గజాల ప్లాట్లకై సంప్రదించండి. సెల్: 9032111600. [W-775760]

SERVICES

■ బాలాజీ గోల్డ్: మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). తాకట్టు షిప్టింగ్ చేయబడును. 90320 40019. [T-1740]

BUSINESS OFFER

■ పేపర్ ప్లేట్ & LED యంత్రాలను వ్యవస్థాపించి, ప్రతి నెల ఎక్కువ ఆదాయాన్ని సంపాదించండి, ఉచిత ముడి పదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్ : 7217656207, 9717434570 [HA-19385]

WANTED

■ వరంగల్‌లోని చికెన్ సెంటర్‌లో పని చేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. జీతం: 18,000/- + రూం + భోజనం ఫ్రీ. సెల్: 6281342090, 9949857816. [WA-6456]

■ హన్మకొండ, వరంగల్, రాంపూర్‌లలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8గం॥, 12 గం॥ డ్యూటీలు కలవు. జీతం: 12000 - 15000. సెల్: 9703637320. [W-1170508]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776024]

■ ప్రముఖ బ్యాంక్ నందు పని చేయుటకు డిగ్రీ అర్హత కల CSO, క్లర్క్, క్యాషియర్, బ్యాంక్ ఆఫీసర్ అర్జెంటుగా కావలెను. (M/F) ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో సంప్రదించండి. 98855 24502. [NA-10405]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520. [M-1203199]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ Dherji సైట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. PVR Projects Ltd., మహారాష్ట్ర. ఫోన్: 040-23348080, 23338080 Email: adm.vineela@gmail.com [HA-779938]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ. 18K ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888, 7569955551. [HA-786818]

■ Wanted Operators - (15), Salary-15k, ESI + PF+ Accomidation, Qly: 10+, Ph: 9110783252 [HA-779937]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9505507558, 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9505507558
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పోదాం పద.. జన జాతరలకు..



వీరభద్రస్వామి ఆలయం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు ప్రధాన జాతరలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఐనవోలు మల్లికార్జునస్వామి, భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రుడి జాతరలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తకొండ బ్రహ్మోత్సవాల్లో ఇప్పటికే ప్రధాన, ప్రథమ ఘట్టమైన స్వామివారి కల్యాణం పూర్తయ్యింది. ఇక.. 14నుంచి మూడు రోజులపాటు జరిగే జాతరకు సిద్ధమైంది. ఐలోని మల్లికార్జునస్వామి జాతర మహోత్సవాలు 13వ తేదీనుంచి ప్రారంభంకానున్నాయి.



విద్యుత్ వెలుగుల్లో ఆలయం..



ఆలయం వెలుపల ఏర్పాటు చేసిన జాయింట్ వీల్



కొత్తకొండ.. భక్తులకు అండ

- వీరభద్రస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి
- 14న భోగి, 15న సంక్రాంతి, బండ్లు తిరిగే కార్యక్రమం

భీమదేవరపల్లి: కోరమీసాలు సమర్పిస్తే కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా పేరొందిన కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యాడు. ప్రతి ఏటా సంక్రాంతి మాసంలో జాతర ఉత్సవాలు 20 రోజులపాటు అత్యంత వైభవంగా జరుగుతాయి. జాతరకు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ ఏడాది సుమారు 10లక్షల మంది భక్తులు హాజరవుతారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన, ప్రథమ ఘట్టం స్వామి కల్యాణం మంగళవారం పూర్తికాగా.. భోగి, సంక్రాంతి వేడుకలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రధాన ఘట్టాలు

ఈ నెల 13న లక్ష బిల్వార్చన, 14న భోగి పండుగ, 15న సంక్రాంతి, బండ్లు తిరుగుట,16న నాగవెల్లి, పుష్పయాగం, 17న త్రిశూల స్నానం, 18న అగ్నిగుండాలు, స్వామి వారి గ్రామ పర్యటన ఉంటుంది.



కొలువు దీరిన వీరభద్రస్వామి

జాతరలో సేవలు..

జాతరలో ఎంపీడీఓ భాస్కర్, ఎంపీఓ నాగరాజు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సేవలు, ముల్కనూర్, వంగర పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించనున్నారు. అలాగే, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శ్వేత, రాజమల్లారెడ్డి ఆధ్వర్యంలో తాగునీరు, హనుమకొండ, వరంగల్, హుస్నాబాద్, హుజూరాబాద్ బస్ డిపోల ఆధ్వర్యంలో 14, 15,16వ తేదీల్లో కొత్తకొండకు ప్రత్యేక బస్సు సర్వీస్‌లు నడవనున్నాయి. కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎల్కతుర్తి సీఐ శ్రీనివాస్, ముల్కనూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో 300 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయం, ఆలయావరణలో సైతం ప్రత్యేక సీసీ కెమరాలు ఏర్పాటు చేశాం.

- కిషన్‌రావు, ఆలయ ఈఓ

అందరి సహకారంతో ముందుకు..

ఎమ్మెల్యే సతీష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సాయంతో ముందుకెళ్తున్నాం. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటూ ఆలయ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తాం.

- కుమారస్వామి, ఆలయ చైర్మన్

జాతరలో ప్రత్యేక షీటీంలు



ఆలయ చైర్మన్‌తో మాట్లాడుతున్న డీసీపీ అశోక్‌కుమార్

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే మహిళా భక్తుల కోసం ప్రత్యేక షీటీంలు ఏర్పాటు చేస్తున్నట్లు సెంట్రోల్ జోన్ డీసీపీ ఎస్.అశోక్ కుమార్ తెలిపారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో డీసీపీ బుధవారం ఆలయానికి వచ్చారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల దర్శనాలు, క్యూలైన్లు, కోనేరు, పోలీస్ కంట్రోల్ రూం, చెక్ పోస్టును పరిశీలించారు. జాతర ముగిసే వరకూ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 24 గంటలపాటు కంట్రోల్ రూంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తూ భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఆలయ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, ఈఓ కిషన్ రావు, కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, ఎల్కతుర్తి సీఐ శ్రీనివాస్, ముల్కనూర్, వంగర ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, మౌనిక, అర్చకులు కంచనపల్లి రాజన్న, వీరభద్రయ్య, రాంబాబు తదితరులు ఉన్నారు.

20 ఏళ్లకు మహర్దశ



కల్యాణ మండపం

వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో 20 ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన కాలక్షేప మండపం నేడు కల్యాణ మండపంగా రూపుదిద్దుకుంది. 2001లో అప్పటి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఇనుగాల పెద్దిరెడ్డి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో కొత్తకొండకు కాలక్షేప మండపాన్ని మంజూరు చేశారు. అప్పటి ఆలయ ధర్మకర్త ఎర్రబెల్లి వెంకటరమణారెడ్డి నిర్మాణ పనులు చేపట్టగా నిధుల లేమితో అసంపూర్తిగానే మిగిలిపోయింది. ఇటీవల ఆలయ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, అర్చకులు, భక్తుల సహకారంతో రూ. 10లక్షల విరాళాలతో అసంపూర్తిగా ఉన్న కాలక్షేప మండప నిర్మాణ పనులు పూర్తి చేశారు. అదే నిర్మాణానికి ఇరువైపులా రెండు గదులు నిర్మించి కల్యాణ మండపంగా మార్చారు. ఇక నుంచి ఆలయంలో జరిగే వివాహాలు, ఇతర శుభకార్యాలతో పాటు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఈ మండపం ఎంతగానో ఉపయోగపడనుంది. కాగా ఈ కల్యాణ మండపాన్ని మంగళవారం రాత్రి ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ ప్రారంభించారు.

జానపదుల మల్లన్న..

13 నుంచి మల్లన్న జాతర మహోత్సవాలు

ఐనవోలు: ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన ఐలోని మల్లికార్జున స్వామి జాతరకు వేళ అయింది. ఈ నెల 13నుంచి జరిగే జాతర మహోత్సవానికి లక్షల సంఖ్యలో భక్తులు తరలిరానుండడంతో దేవాదాయశాఖ అధికారులతోపాటు ఇతర శాఖల అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. జాన పదుల జాతరగా కీర్తినొందుతున్న ఐలోని మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి.

ముమ్మరంగా పనులు



సిద్ధమైన రథం



మహిళా భక్తులు దుస్తులు మార్చుకునే గదులు

జాతర పనుల్లో భాగంగా క్యూలైన్లు, చలువ పందిళ్లు, నీటి సరఫరా, పారిశుధ్య పనులు, జల్లు స్నానాలు, స్త్రీలు దుస్తులు మార్చుకొనే గదుల ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, ఆలయం చుట్టూ లైటింగ్, సిరీస్ బల్బుల ఏర్పాటు తదితర పనులన్నీ తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన చేపడుతున్నారు. జాతర సమయంలో రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా విద్యుత్‌శాఖ తగు ఏర్పాట్లు చేసింది. కుడా నిధులతో ఆలయ తూర్పు భాగంలో ముఖ స్వాగత తోరణాలు సిద్ధమయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ తాగునీరు, నీటి సరఫరాపై దృష్టి పెట్టింది. భక్తులకు ఉపయుక్తంగా దుకాణ సముదాయాలు ఏర్పాటవుతున్నాయి. ఐనవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది 24 గంటల వైద్య సేవలు మూడు షిఫ్టులుగా అందించడానికి సిద్ధంగా ఉన్నారు. రోడ్డు రవాణా సంస్థ ఐనవోలు నుంచి హైదరాబాద్, వరంగల్, కాజీపేట, కొమురవెల్లి, వేములవాడ తదితర ప్రాంతాలకు వెళ్లే భక్తులకు కోసం బస్సు సౌకర్యం కల్పిస్తోంది. వరంగల్ నుంచి జాతర నాలుగు రోజులు ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి సుమారు 100 సీసీ కెమరాల నిఘాలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టనున్నారు.

సకల ఏర్పాట్లు..

భక్తులకు ఆలయానికి సంబంధించిన సమాచారం పూర్తిగా తెలిసే విధంగా ఈసారి ప్రత్యేకంగా పీఆర్‌ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నాం. అందులో ఆలయంలో సంవత్సరంపాటు జరిగే పూజా కార్యక్రమాల వివరాలు అందుబాటులో ఉంచుతున్నాం. అలాగే ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల వివరాలతోపాటు ఇంకా చేపట్టాల్సిన, చేపట్టబోతున్న పనులను వివరించి భక్తుల నుంచి సహాయ సహకారాలు కోరబోతున్నాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకల ఏర్పాట్లు చేస్తున్నాం. సమాచార కేంద్రం, కల్యాణం, అభిషేకం టికెట్లు లభించేలా ప్రధాన ఆలయం వెలుపల ప్రాంగణంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం. భక్తులు, అధికారులు, వలంటీర్లు కీలకమైన నాలుగు రోజులు సహకరించాలి. బెల్లం లడ్డూలతోపాటు సాధారణ లడ్డూ, పులిహోర ప్రసాదాల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నాం.

- అద్దంకి నాగేశ్వర రావు, ఆలయ ఈఓ, ఐనవోలు

షెడ్యూల్

- జనవరి 13న(శుక్రవారం) ఉత్సవాలు ప్రారంభం. స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలంకరణ.
- 14న భోగి పండుగ, స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు.
- 15న మకర సంక్రాంతి పండుగ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, 'రాత్రి ప్రభల' బండ్లు తిరగడం.
- 17న మహాసంప్రోక్షణ సమారాధన.
- 26న శ్రీభ్రమరాంభిక అమ్మవారి సప్తమ వార్షికోత్సవం.
- ఫిబ్రవరి 5న శ్రీఎల్లమ్మ దేవత పండుగ

ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఉదయం సూర్యప్రభ వాహనసేవ, రాత్రి చంద్రప్రభ వాహనసేవ.
- 17న ఉదయం అశ్వ వాహనసేవ, రాత్రి శేషవాహనసేవ, బలిహరణ.
- 18న మహాశివరాత్రి 'శివకల్యాణం' పెద్ద పట్నం, ఉదయం సింహ వాహనసేవ, రాత్రి నంది వాహనసేవ.
- 19న రావణ వాహనసేవ, రాత్రి రథోత్సవం.
- 20న పర్వత వాహనసేవ, రుద్రహోమం, చండీహోమం, బ్రహ్మోత్సవాల ముగింపు, రాత్రి పవళింపుసేవ, పుష్పోత్సవం, ఏకాంత సేవ.
- మార్చి 19న పెద్దపట్నం మల్లికార్జునస్వామి కల్యాణం, పెద్దపట్నం ఊరేగింపు.
- మార్చి 22న 'ఉగాది' బిల్వార్చన, సాయంత్రం పంచాంగ శ్రవణం.

ఈ కార్యక్రమాలతో రెండు నెలల పదిరోజుల జాతర ఉత్సవాలు ముగుస్తాయి. అదేవిధంగా ప్రతి బుధ, ఆదివారాల్లో పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారు.



నూతనంగా ఏర్పాటు చేసిన నల్లాలు

క్లుప్తంగా

గొర్రెలు చెట్లు మేశాయని..

కాపరి సెల్‌ఫోన్ తీసుకున్న ఫారెస్ట్ అధికారులు

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



గొర్రెల కాపరి భిక్షపతి

స్టేషన్‌ఘన్‌పూర్: గొర్రెలు, మేకలు రోడ్డు పక్కన చెట్లను మేశాయని గొర్రెల కాపరి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను ఫారెస్టు అధికారులు బలవంతంగా తీసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై గొర్రెల, మేకల పెంపకం దార్ల సంఘం జిల్లా కార్యదర్శి సాదం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘన్‌పూర్‌కు చెందిన చాగ భిక్షపతి అనే గొర్రెల కాపరి రెండు రోజుల క్రితం ఘన్‌పూర్ శివారు తాటికొండ క్రాస్ రోడ్డు వద్ద గొర్రెలను మేపి సాయంత్రం ఇంటికి తోలుకు వస్తున్నాడు. ఫారెస్టు సిబ్బంది అతడిని ఆపి రోడ్డు పక్కన పెట్టిన చెట్లు మేశాయని అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. అనంతరం కాపరి ఫారెస్టు ఆఫీస్‌కు వెళ్లి అడగగా గొర్రెలు చెట్లు మేసినందుకు రూ.7 వేలు ఫైన్ కట్టాలని, లేనిపక్షంలో కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు. జిల్లాలో రోజురోజుకూ గొర్రెలు, మేకల కాపరులపై ఫారెస్టు అధికారుల దాడులు పెరుగుతున్నాయన్నారు. తక్షణమే స్పందించి లాక్కున్న సెల్‌ఫోన్‌ను ఇవ్వాలని లేదంటే ఘన్‌పూర్‌లోని ఫారెస్టు కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు.

కార్యాలయానికి రాలేదు..

రోడ్డు పక్కన నాటిన మొక్కలను గొర్రెలను మేస్తుంటే గమనించి అక్కడి నుంచి తోలుకెళ్లాలని చెప్పాం. కాపరి వద్ద సెల్‌ఫోన్ తీసుకున్నది వాస్తవమే. కార్యాలయానికి వచ్చి తీసుకెళ్లమని చెప్పాం. అయితే కాపరి కార్యాలయానికి వస్తే మొదటి తప్పని చెప్పి వదిలేస్తాం. కానీ ఆయన ఆఫీస్‌కు రాలేదు. జరిమానా వేశామనేది అబద్ధం. ఆఫీస్ సమయానికి వస్తే సెల్‌ఫోన్ ఇచ్చేస్తాం.

- మురళీధర్, ఘన్‌పూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి

కేయూ పరిధిలో 26 మంది డీబార్

- స్క్వాడ్ బృందం కారుపై విద్యార్థుల దాడి
- ఇచ్చోడలో పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు
- దాడిని ఖండించిన వీసీ రమేష్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ కోర్సు ఐదో సెమిస్టర్ పరీక్షల్లో వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 26 మంది విద్యార్థులు డీబార్ అయ్యారని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి. మల్లారెడ్డి, నియంత్రణాధికారులు మధుకర్, నరేందర్‌లు తెలిపారు. డీబార్ అయిన కొంతమంది విద్యార్థులు స్క్వాడ్ బృందం కారుపై రాళ్లతో దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని కాకతీయ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో కాపీయింగ్ చేస్తుండగా ఫ్లయింగ్‌స్క్వాడ్ డీబార్ చేశారు. అనంతరం స్క్వాడ్ బృందం డాక్టర్ శ్రీనివాస్, ప్రేమ్ చంద్, అతిల్‌బేగంలు కారులో పరీక్ష కేంద్రం నుంచి బయటకు రాగానే డీబార్ అయిన విద్యార్థులు ఓ చెట్టువద్ద కాపుకాసి ఒక్కసారిగా రాళ్లతో దాడి చేశారని తెలిపారు. ఈ దాడిలో కారు ధ్వంసమైంది. అధికారులు ఇచ్చోడలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే ఇచ్చోడ వివేకానంద డిగ్రీ కాలేజీలో 7, సాయి సమత డిగ్రీ కాలేజీలో 11, రేబన్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఒకరు, హనుమకొండ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఒకరు, శ్రావణి డిగ్రీ కాలేజీలో ఒకరు కాపీయింగ్ చేస్తూ డీబార్ అయ్యారని వారు తెలిపారు.

దాడిపై వీసీ ఖండన

ఇచ్చోడలోని కాకతీయ డిగ్రీ కళాశాలను తనిఖీ చేసిన స్క్వాడ్ బృందంపై విద్యార్థులు దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ తెలిపారు. దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామని, పోలీసులు చర్య తీసుకోవాలన్నారు.

శోభాయమానంగా నగర సంకీర్తన



రామలింగేశ్వరస్వామి దేవాలయంలో చేపట్టిన శోభాయాత్ర

హన్మకొండ కల్చరల్: వరంగల్ నగరంలోని రాధాకృష్ణ గార్డెన్స్‌లో వరంగల్ విద్యారణ్య అర్షధర్మ రక్షణ సంస్థ, ఎస్ఎస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే సద్గురు శ్రీత్యాగరాజ స్వామి వారి 176వ ఆరాధనోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు శ్రీభద్రకాళి దేవాలయం ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేందర్, ఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నన్నపునేని వాణి పాల్గొన్నారు. ఆర్చీ ఎదుట ఉన్న శ్రీవిద్యారణ్యస్వామి వారి విగ్రహానికి పుష్పాలంకరణ చేసి అనంతరం శ్రీత్యాగరాజస్వామి చిత్రపటానికి పూల మాల వేసి ప్రత్యేక రథంపై ప్రతిష్ఠించారు. రామన్నపేటలోని రామలింగేశ్వరస్వామి దేవాలయం నుంచి రాధాకృష్ణగార్డెన్ వరకు డప్పులు, బోనాలు, కోలాటాలు, మంగళవాయిద్యాలతో నగర సంకీర్తన నిర్వహించారు. సంగీత త్యాగరాజస్వామి వేషధారణలో గురువు ఉమ్మడి లక్ష్మణాచారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. త్యాగరాజ పంచరత్నకీర్తనల గోష్ఠి గానం, త్యాగరాజ కీర్తనల గానం అలరించింది. భోజన విరామం అనంతరం వీణా వాదన, నృత్య ప్రదర్శనలు, సంగీత కచేరీ, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రిటైర్డ్ నిట్ ప్రొఫెసర్ పాండు రంగారావు, డా.సనత్‌కుమార్, సంగీత నృత్యకళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్, నిర్వహణ బాధ్యులు కుమారస్వామి, సభ్యులు, కార్పొరేటర్లు, నాయకులు, కళాకారులు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

దేవాదుల భూములపై కన్ను

దర్జాగా మొరం కోసం తవ్వకాలు

- యథేచ్ఛగా వ్యాపారం
- చోద్యం చూస్తున్న అధికారులు

హసన్‌పర్తి: చెరువులు, కుంటలు, ఎస్సారెస్పీ భూముల్లో మొరం తవ్వుతున్న అక్రమార్కుల కన్ను ఇప్పుడు దేవాదుల భూములపై పడింది. ఈభూముల్లో నుంచి మొరం తవ్వకాలు చేపడుతున్నారు. మొరాన్ని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. పెద్ద పెద్ద గుంతలు తీయడం వల్ల తమ పొలాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. రెండ్రోజుల క్రితం రాత్రి వేళలో పొలం వద్దకు వెళ్లిన ఓ రైతు మొరం కోస తీసిన గుంతల్లో పడి గాయాలపాలయ్యాడు. ఈ దందా ముచ్చర్ల, పెంబర్తి శివారుల్లోని దేవాదుల భూముల్లో నుంచి సాగుతోంది. విలువైన భూములను మొరం క్వారీగా మార్చుతున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

రాత్రి వేళ తవ్వకాలు

కాగా రాత్రివేళ ఈ మొరం కోసం తవ్వకాలు చేపడుతున్నారు. మూడు జేసీబీలు, పది టిప్పర్లతో మొరం తరలిస్తున్నట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. ఒక్కో టిప్పర్ మొరాన్ని రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు అమ్ముతున్నారని, ఈవిషయమై పలువురు రైతులు మొరం వ్యాపారిని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని రైతులు తెలిపారు.



మొరం కోసం తవ్విన దేవాదుల భూములు

ఈవిషయమై నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సేవలు అంతంతే!

- పేరుకే ప్రాంతీయం.. సేవలు నామమాత్రం
- కంటి ఆస్పత్రిలో రోగులకు అవస్థలు

ఎంజీఎం: బోధనాస్పత్రిగా ఉన్న ప్రాంతీయ కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కొరతతో రోగులు అవస్థలు పడుతున్నారు. పాత నాలుగు జిల్లాలకు నేత్ర వైద్య సేవలు అందించాల్సిన ఆస్పత్రికి చుట్టుపక్కల పది జిల్లాల నుంచి వందలాది మంది వైద్య సేవలు, శస్త్ర చికిత్సల కోసం వస్తుంటారు. సరైన వైద్య సేవలు అందక రోగులు వెనక్కి తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇద్దరు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, మరో ఎనిమిది వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండడంతో శస్త్ర చికిత్సల్లో తీవ్రమైన జాప్యం ఏర్పడుతోంది. ఇటీవల నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఇక్కడి నుంచి బదిలీ చేసి వారి స్థానంలో వేరే వారిని నియమించకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి ఆపరేషన్ల కోసం వస్తున్న వారు నెలల తరబడి శస్త్ర చికిత్స కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. గతంలో పని చేసిన వారిలో నలుగురు వైద్యులే ప్రస్తుతం ఉన్నారు. మరో నలుగురు కొత్త కాంట్రాక్టు వైద్యులతో ఆపరేషన్లు చేయాల్సి వస్తోంది. రోజుకు 400 మంది రోగులు ఆస్పత్రికి వస్తే కనీసం 20 మందికి ఆపరేషన్లు చేయలేకపోతున్నారని రోగులు విమర్శిస్తున్నారు. ఒక్క రోగి కనీసం ఆరేడు సార్లు తిరిగితే కానీ ఆపరేషన్లు జరగట్లేదంటున్నారు. ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కంటి ఆస్పత్రిలో ఆపరేషన్ల సంఖ్య పెంచాలని ఆదేశించినా.. ఆ దిశగా ప్రయత్నాలు జరగట్లేదు. వైద్యుల సంఖ్య పెంచి రోగులకు సేవలు అందించాలని కోరుతున్నారు.

ఐజేయూ జాతీయ కౌన్సిల్‌లో పలువురు జర్నలిస్టులకు చోటు

కాశిబుగ్గ: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్, ఐజేయూ జాతీయ కౌన్సిల్‌లో ఉమ్మడి జిల్లా జర్నలిస్టులకు చోటుదక్కింది. హైదరాబాద్‌లో జరిగిన 10వ జాతీయ మహాసభలో వీరిని నియమించారు. నియమితులైన వారిలో తాటిపల్లి నరేశ్, కూన మహేందర్, శంకేసి శంకర్‌రావు, చిలుముల సుధాకర్, మెండు రవీందర్, ఎస్ఎస్ రావు, అక్బర్, టి.కృష్ణారెడ్డి, ఎం.అశోక్, కక్కెర్ల జగన్, కె.విజయ్, డి.ప్రవీణ్‌లు ఉన్నారు. కాగా తమ నియామకానికి సహకరించిన అల్లం నారాయణ, ఇతర రాష్ట్ర నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

అన్‌ఎయిడెడ్ సర్వీస్ ఇంక్రిమెంట్ల వివాదం

- టీచర్ల ఎస్‌బీ పరిశీలనకు లోకల్ ఆడిట్ అధికారులు
- వారు ససేమిరా అనడంతో ఎంఈఓలకు అప్పగింత
- అన్‌ఎయిడెడ్ సర్వీస్‌కు డీఈఓ ర్యాటిఫికేషన్ తప్పనిసరి

విద్యారణ్యపురి: ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద అన్‌ఎయిడెడ్ సర్వీస్ ఇంక్రిమెంట్ల కోసం కొందరు అనర్హులు దరఖాస్తు చేశారనే ఆరోపణల నేపథ్యంలో డీఈఓ బిల్లులు నిలిపేశారు. దీనిపై ఇటీవల 'సాక్షి'లో జిల్లా విద్యాశాఖలో అన్‌ఎయిడెడ్ సర్వీస్ ఇంక్రిమెంట్ల వివాదంపై పలు కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్ హై జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తూ అన్‌ఎయిడెడ్ సర్వీస్ కింద ఇంక్రిమెంట్ల కోసం దరఖాస్తు చేసిన 68 మంది ఉపాధ్యాయుల బిల్లులకు సంబంధించిన 'సర్వీస్ బుక్స్'ను లోకల్ ఫండ్ ఆడిట్ అధికారులకు పంపారు. అయితే ఎయిడెడ్ పాఠశాలల అన్‌ఎయిడెడ్ ఇంక్రిమెంట్ల వ్యవహారాన్ని ఎస్‌బీలో పరిశీలించే అధికారం తమకు లేదని ఆడిట్ అధికారులు డీఈఓ కార్యాలయానికి తిరిగి పంపించారు.

ఎంఈఓకు బాధ్యతలు

హనుమకొండ జిల్లాలో ఎంఈఓ రాంకిషన్‌రాజుకు ఆయా 68 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయుల ఎస్‌బీలను పరిశీలించాలని డీఈఓ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎంఈఓ వారి సర్వీస్‌బుక్స్‌ను పరిశీలించారు. అయితే అన్ ఎయిడెడ్ సర్వీస్ కింద పనిచేసినప్పుడు డీఈఓ ర్యాటిఫికేషన్ నియామకం కార్డు ఉండాలని, అందుకు సంబంధించిన కాపీలను అందజేయాలని ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వాట్సాప్‌లో ఎంఈఓ సమాచారం పంపారు.